
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 8 ఏప్రిల్ 2025



# నిధులు లేవు.. నీళ్లు రావు!

- హంద్రీ నీవా పంట కాలువలపై అంతులేని నిర్లక్ష్యం
- గత వైసీపీ హయాంలో ఒక్కపైసా ఇవ్వని వైనం
- రూ.230 కోట్లు ఇస్తే 45 వేల ఎకరాలకు నీరు
- నేడు హంద్రీ నీవాను సందర్శించనున్న మంత్రి నిమ్మల రామానాయుడు



ముళ్ల కంపతో నిండిపోయిన హంద్రీనీవా పత్తికొండ జలాశయం


కర్నూలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గంపెడు మట్టి తీయలేదు. ఐదేళ్ల నిర్లక్ష్యం కరువు రైతులకు శాపంగా మారింది. హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పత్తికొండ (పందికోన) జలాశయం సహా కుడి, ఎడమ కాలువలను అసంపూర్తిగా వదిలేశారు. రూ.210 కోట్లు ఖర్చు చేస్తే 42,894 ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. కానీ నిధులు ఇవ్వడం లేదు. హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ సరే.. పంట కాలువలను పట్టించుకోరా..? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నేడు జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పత్తి కొండ నియోజకవర్గంలో హంద్రీ నీవా కాలువను సందర్శించనున్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7.5 టీఎంసీలు నీటిని వినియోగించుకొని 80 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో 50,626 ఎకరాలు, ఎడమ కాలువ (ఎల్‌బీసీ) పరిధిలో 10,774 ఎకరాలు కలిపి 61,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. ప్రస్తుతం 18,500 ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వడం లేదు. పిల్ల కాలువలు పూర్తి చేస్తే పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో పలు గ్రామాలు పచ్చని పైర్లతో సస్యశ్యామలం అవుతాయి. 1.216 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన పత్తికొండ జలాశయం రాతి పరుపు (స్టోన్ రివిట్‌మెంట్), కడ తూము వంటి పనులు సహా ఎడమ కాలువ పరిధిలో సింగిల్ లైన్ బిడ్జి (ఎస్‌ఎల్‌బీ), ఆర్‌బీసీ, ఫీల్డ్ చానల్స్, డిస్ట్రిబ్యూటరీలు, కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో దేవనకొండ, ఆస్పరి మండలాల్లో డిస్ట్రిబ్యూటర్లు, ఫీల్డ్ చానల్స్, ఆర్‌అండ్‌బీ క్రాసింగ్ బిడ్జిలు, ఎల్‌బీసీ.. వంటి నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.161 కోట్లు ఇవ్వండని పలుమార్లు ప్రతిపాదనలు పంపితే ఒక్కపైసా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంచనా వ్యయం రూ.210 కోట్లకు చేరింది. నిధులిస్తే 42,894 ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంది. నిధులు ఇచ్చి నీళ్లు ఇస్తారా..? లేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రధాన కాలువ విస్తరణ

ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కులు కూడా తీసుకోలేని పరిస్థితి ఉంది. ఫేజ్-1 కింద 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి వీలుగా ప్రధాన కాలువ విస్తరణ పనులు రూ.1,030 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. దాదాపుగా రూ.300 కోట్లు విలువైన మట్టి పనులు చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఐదేళ్లు గంపెడు మట్టి కూడా తీయలేదు. పైగా 6,300 క్యూసెక్కుల విస్తరిస్తామంటూ రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచి వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత టీడీపీ ప్రభుత్వం చేపట్టి ఆగిపోయిన బ్యాలెన్స్ విస్తరణ పనులను రూ.695 కోట్లతో మొదలు పెట్టారు. ఫేజ్-2 కింద అనంతపురం జిల్లాలో రూ.1,405 కోట్లతో సీసీ లైనింగ్ పనులు చేపట్టారు.

మిగతా 7వ పేజీలో

# మెగా వైద్యం.. మెరుగైన లక్ష్యం..!



- వైద్యరంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నంద్యాల జిల్లాను వేధిస్తున్న ఐదురకాల జబ్బులు
- అధికారుల పరిశోధనలో వెల్లడి
- పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో చంద్రబాబు

నంద్యాల ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాటు నిర్వీర్యమైన వ్యవస్థలను చక్కదిద్దే పనిలో చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆరోగ్యాంధ్రప్రదేశ్‌పై దృష్టి సారించింది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని వారికి కూడా మెరుగైన వైద్యం అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. తాజాగా సోమవారం రాజధాని అమరావతిలో చంద్రబాబు వైద్యం, ఆరోగ్యంపై ప్రత్యేకంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇందులో కీలక అంశాలను తెలియజేయడంతో పాటు ప్రతి నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి ఉంటుందని వెల్లడించారు. అమరావతిలో గ్లోబల్ మెడ్‌సిటీని ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి నియోజకవర్గంలో స్థాయిని బట్టి 100 నుంచి 300 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రణాళికలు రూపొందించామన్నారు. మరీ ముఖ్యంగా గుండెజబ్బులు, డయాబెటిస్, హైపర్ టెన్షన్, శ్వాసకోశ వ్యాధులు కొన్నిచోట్ల విస్తృతంగా పెరుగుతున్నాయి. వీటిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలను ఒక్కో యూనిట్‌గా తీసుకుని పది రకాల జబ్బులపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో నంద్యాల జిల్లాలో గుండె, లివర్, ఆస్తమా, న్యూరో, కిడ్నీ జబ్బులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వెల్లడించారు. మొత్తం మీద ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా చంద్రబాబు నాయుడు ముందుకెళ్తున్నారు.



### ప్రత్యేక దృష్టిపెడుతున్నాం



ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం జిల్లాలో ప్రధాన జబ్బులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరలో ఆరు ఆసుపత్రులకు 100 పడకల స్థాయి పెంచి మల్టీస్పెషాలిటీ సేవలందించే దిశగా చర్యలు తీసుకుంటాం. కిడ్నీ, గుండె, లివర్, న్యూరో, ఆస్తమా కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో పాటు ప్రధానమైన జబ్బులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం. ఆహారపు అలవాట్లు, జీవన విధానంపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకవస్తాం.

- డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ

### నంద్యాల జిల్లాలో జబ్బులు ఇలా...



బీపీ : రాష్ట్ర వ్యాప్తంగా 19,78,698 మంది బీపీతో బాధపడుతున్నారు. వీరిలో అత్యధికంగా 1,15,401మంది కోనసీమలో ఉండగా.. నంద్యాల జిల్లాలో 62,280 మంది బీపీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఈ కేటగిరీలో నంద్యాల జిల్లా 21 స్థానంలో ఉంది.



క్యాన్సర్ : రాష్ట్ర వ్యాప్తంగా 1,19,397 మంది వివిధ రకాల క్యాన్సర్లతో బాధపడుతున్నారు. అత్యధికంగా 6,333 మందితో కాకినాడ జిల్లా మొదటి స్థానంలో ఉండగా జిల్లాలో 4,003 మందితో నంద్యాల జిల్లా 22 స్థానంలో ఉంది.




కిడ్నీ : రాష్ట్ర వ్యాప్తంగా 1,73,479మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. అత్యధికంగా 11,153 మంది శ్రీకాకుళం జిల్లాలో ఉన్నారు. 8,780 మందితో నంద్యాల జిల్లా ఐదో స్థానంలో ఉంది.



షుగర్: రాష్ట్ర వ్యాప్తంగా 11,13,963 మంది షుగర్(మధుమేహం)తో బాధపడుతున్నారు. గుంటూరు జిల్లాలో అత్యధికంగా 66,398 మంది ఉండగా నంద్యాల జిల్లాలో 33,657 మందితో నంద్యాల జిల్లా 21 స్థానంలో ఉంది.




లివర్: రాష్ట్రంలో 30,646 మంది లివర్ సమస్యతో బాధపడుతున్నారు. అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 2,168 మంది ఉండగా.. 1,651మందితో నంద్యాల జిల్లా ఐదో స్థానంలో ఉంది.



గుండెజబ్బులు : రాష్ట్ర వ్యాప్తంగా 2,61,100 మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా 15,655 మంది ఉండగా 15,624 మందితో నంద్యాల జిల్లా రెండో స్థానంలో ఉంది.



ఆస్తమా: రాష్ట్ర వ్యాప్తంగా 54,362 మంది ఆస్తమా బాధితులు ఉన్నారు. అత్యధికంగా 5,204 మంది నెల్లూరు జిల్లాలో ఉన్నారు. 3,680 మందితో నంద్యాల జిల్లా నాలుగో స్థానంలో ఉంది.



న్యూరో (నరాల సమస్య): రాష్ట్రంలో 1,07,433 మంది న్యూరో బాధితులు ఉన్నారు. వీరిలో 6,847 మంది అత్యధికంగా విజయనగరం జిల్లాలో ఉండగా.. 6,583 మందితో నంద్యాల జిల్లా రెండో స్థానంలో ఉంది.

### స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత



ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో స్పెషలిస్ట్ వైద్యులు లేరు. కిడ్నీ, న్యూరాలజీ, ఆస్తమా వైద్యులు మాత్రమే ఉన్నారు. గుండె, లివర్ వైద్యులు లేకపోవడంతో రోగులను కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నాం. మిగిలిన విభాగాల్లో కూడా సరిపడా వైద్యులు లేరు. వైద్యుల కొరతపై ప్రభుత్వానికి నివేదించాం. జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగులకు ఉన్నవారితోనే మెరుగైన వైద్యం అందించేలా చూస్తాం.

- మల్లేశ్వరి, సూపరింటెండెంట్



## సీఎంఓ దరఖాస్తులను పరిష్కరించండి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 220 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని సూచించారు.

**16 మంది రైతులకు డీ నోటిపై పత్రాల పంపిణీ:** చుక్కల భూములు, 22-ఏ1 భూములు నిషేధిత జాబితాలో ఉండి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 16మంది రైతులకు డీ నోటిఫైడ్ చేసిన క్లియరెన్స్ పత్రాలు అందజేశామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృతప్రచారంతో అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సెంటినరీ హాల్‌లో డీఎంహెచ్‌ఓ డా. వెంకటరమణ అధ్యక్షతన ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.



ప్రజల నుంచి సమస్యలు వింటున్న కలెక్టర్ రాజ కుమారి

## అదనపు జిల్లా న్యాయాధికారుల బదిలీ

కర్నూలు లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న జి. భూపాల్ రెడ్డిని విజయవాడ ఏసీబీ కోర్టుకు బదిలీ చేసి ఆయన స్థానంలో కాకినాడలో పని చేస్తున్న పి.కమలాదేవిని నియమించారు. కర్నూలు 6వ అదనపు జిల్లా న్యాయాధికారిగా పని చేస్తున్న పి. పాండురంగారెడ్డిని క్రిష్ణా జిల్లా మచిలీపట్నంకు బదిలీ చేసి ఆయన స్థానంలో నంద్యాలలో పని చేస్తున్న మూడో అదనపు జిల్లా న్యాయాధికారి పి. వాసును నియమించారు. ఒంగోలులో పని చేస్తున్న డి. అమ్మనరాజును నంద్యాల మూడో అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. అనంతపురంలో పని చేస్తున్న ఎం. శోభారాణిని ఖాళీగా ఉన్న కర్నూలు సీబీఐ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. అనకాపల్లిలో పని చేస్తున్న ఎన్. శ్రీవిద్యను ఖాళీగా ఉన్న కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయాధికారిగా నియమించారు. ఆళ్లగడ్డలో పని చేస్తున్న ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణను ఏలూరుకు బదిలీ చేసి కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పాలని ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 మంది అదనపు జిల్లా జడ్జిలను బదిలీ చేసి ఈ నెల 21వ తేదీలోపు ఆయా న్యాయాధికారులు తమ నూతన పదవీ బాధ్యతలు స్వీకరించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది.

## సర్వే ప్రక్రియను పూర్తి చేయాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో చేపట్టిన వర్క్‌ఫ్రం హోమ్ మి స్సింగ్ ఎంప్లాయిస్, సిటిజన్స్ తదితర సర్వేలను వెంట నే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకు మారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటి నరీ హాల్‌లో సర్వే ప్రక్రియపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 1, 27, 813మంది వర్క్‌ఫ్రం హోంకు సంబంధించి పెండింగ్ ఉంద న్నారు. బేతంచెర్లలో 10వేలు, నంద్యాల అర్బన్‌లో 11,960, డోన్‌లో 7,553, కొలి మిగుండ్లలో 6,981, కోవెలకుంట్లలో 5,684, ఆళ్లగడ్డ, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, అవుకు, పాణ్యం, శిరివెళ్ల, బనగానపల్లె తదితర మండలాల్లో 4వేలకుపైగా సర్వే పెండింగ్ ఉందని తెలిపారు.

## ఉమ్మడి జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు




నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. వారం రోజుల నుంచి 36 డిగ్రీల సెల్సియస్ నుంచి 38 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కానీ సోమవారం ఒక్కసారిగా కర్నూలు, నంద్యాల జిల్లాలు వేడెక్కాయి. కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలంలో 40.70 డిగ్రీలు, కోడుమూరు మండలంలో 40.70డిగ్రీలు, హోళగుందలో 40.61, ఆదోనిలో 40.40, కర్నూలు నగరంలో 40.28 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లా పాణ్యం మండలంలో 40.59 డిగ్రీలు, రుద్రవరంలో 40.55, డోన్‌లో 40.47, ఆళ్లగడ్డలో 40.31, జూపాడుబంగ్లాలో 40.03 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ మండలాల్లో గాలిలో తేమశాతం తగ్గడంతో వడగాలులు వీచినట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే మూడురోజుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశముందని హెచ్చరించారు.

## అడవులను రక్షించుకుందాం

### ఎన్‌ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ బీవీఏ.కృష్ణమూర్తి

ఆత్మకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖతో పాటు జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్)తో సమన్వయం చేసుకుని అడవులను రక్షించుకుందామని నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ బీవీఏ.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామ సమీపంలో గల వైఎస్సార్ స్మృతివనంలో జాతీయ, రాష్ట్ర జాతీయ విపత్తు దళాల ప్రతినిధులతో సమావేశమై ఫారెస్ట్ ఫైర్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ పద్దతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో భాగంగా తొలిరోజు ఎన్‌ఎస్‌టీఆర్ ఎఫ్‌డీపీటీ కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. అడవుల్లో భారీ అగ్ని ప్రమాదాలు సంభవించినట్లయితే జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఇందుకు ఆయా దళాలు కూడా అటవీశాఖకు సహకరించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, నంద్యాల, మార్కాపురం, గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్‌ల డిప్యూటీ డైరెక్టర్లు సాయిబాబా, అనురాగ్‌మీనా, సందీప్ కృపాకర్, నిషాకుమారీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండర్ దామోదర్ సింగ్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బాలరాజు, ఆత్మకూరు, బైర్లూటి రేంజ్ అధికారులు పట్టాభి, కృష్ణప్రసాద్, ఎఫ్‌ఎస్‌ఓ మగ్బూల్ తదితరులు ఉన్నారు.



విపత్తు దళాల ప్రతినిధులతో అటవీశాఖ ముఖ్య అధికారులు

## మార్కెట్ యార్డులో అక్రమాలపై విచారణ

### నేడు కలెక్టర్‌కు జేడీ నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విచారిస్తున్న జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు

నంద్యాల, మార్చి7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్ యార్డులో జరుగుతున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 3వ తేదీన 'పైసా వసూల్..', 5వ తేదీన 'అక్రమార్కుల్లో అలజడి..' శీర్షికలతో ప్రచురితమైన కథనాలకు ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ రాజకుమారి స్పందించి ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను విచారణ అధికారిగా నియమించారు. దీంతో సదరు అధికారి సోమవారం స్థానిక నంద్యాల మార్కెట్‌యార్డులో కార్యదర్శి కల్పన తదితర అధికారులతో పలు అంశాలపై ఆరా తీశారు. పత్రికలో వచ్చిన అంశాల పరంగా రికార్డులతో పాటు అద్దెల వివరాలను పరిశీలించగా.. పలు లోపాలు వెలుగు చూసినట్లు సమాచారం. మార్కెట్‌యార్డు అద్దెలు, తదితర వసూళ్ల పరంగా వ్యత్యాసాలను గుర్తించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో విచారణలో గుర్తించి అంశాల పరంగా సమగ్ర నివేదికను కలెక్టర్‌కు మంగళవారం అందజేస్తామని జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు.

## ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం: ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరిస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి 80 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి నంద్యాలకు రాలేనివారు ప్రతి సోమవారం దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డీఎస్పీ కార్యాలయాల్లో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

## 9 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలో 9 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

| సీఐ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| ఎం.దస్తగిరిబాబు | డీటీసీ, అన్నమయ్య | శిరివెళ్ల సర్కిల్, నంద్యాల |
| ఎస్.వంశీధర్ | శిరివెళ్ల సర్కిల్ | వీఆర్, నంద్యాల |
| వి.ప్రభాకర్ రెడ్డి | ఎస్సీ, ఎస్టీ సెల్ అన్నమయ్య జిల్లా | ఫ్యాక్షన్ జోన్, నంద్యాల |
| ఎం.పార్థసారధి | ఫ్యాక్షన్ జోన్, నంద్యాల | డీటీసీ కర్నూలు |
| పి.గౌతమి | డీటీసీ కర్నూలు | ఉమెన్ పీఎస్-1, నంద్యాల |
| జె.రమేష్ కుమార్ | ఉమెన్ పీఎస్-1, నంద్యాల | వీఆర్, నంద్యాల |
| యు.లక్ష్మయ్య | వీఆర్, కర్నూలు | సీసీఎస్-3, నంద్యాల |
| ఎన్.క్రిష్ణయ్య | సీసీఎస్-3 నంద్యాల | డీసీఆర్‌బీ, నంద్యాల |
| ఏ.ఆదినారాయణ రెడ్డి | డీసీఆర్‌బీ, నంద్యాల | డీటీసీ, అన్నమయ్య |

# రామకోటి

● పూర్తి చేసిన నాగలదిన్నె వాసి

● ఆంజనేయస్వామి ఆలయంలో సమర్పణ



రామకోటి పుస్తకాలతో బోయ చెన్నయ్య, మల్లేశ్వరి దంపతులు

రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన బోయ చెన్నయ్య దంపతులు రామకోటి పూర్తి చేశారు. బోయ చెన్నయ్య 40 ఏళ్ల క్రితం బెంగుళూరుకు ఉద్యోగ రీత్యా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొంది అక్కడే ఉంటున్నారు. జన్మించిన ఆయన రామ నామం కోటిసార్లు రాసి స్వగ్రామంపై మక్కువతో నాగులదిన్నెలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సమర్పించారు. 2017 నవంబరు 3వ తేదీన ఆయన రామకోటిని ప్రారంభించి ఈనెల మూడో తేదీన పూర్తి చేశారు. రామకోటిని పూర్తి చేసేందుకు 8 సంవత్సరాల ఒక నెల 3 రోజుల పాటు ఆయన సమయం తీసుకున్నారు. సొంతూరు కన్నతల్లితో సమానమని, అందుకే రామకోటిని పూర్తి చేసి ఇక్కడ అప్పగించినట్లు తెలిపారు. రామకోటి పూర్తి చేయడం తన భార్య బోయ మల్లేశ్వరి సహకారం జీవితంలో మర్చిపోలేనని చెన్నయ్య పేర్కొన్నారు.

## ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్



గిగ్ బాస్కెట్ కార్మికులతో పేర్లు నమోదు చేయిస్తున్న జాయింట్ కమిషనర్ బాలునాయక్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని రాయలసీమ జోన్ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం. బాలునాయక్ అన్నారు. సోమవారం వెంటకమరణ కాలనీలో ప్రత్యేక నమోదు సెంటరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాట్ ఫాం అండ్ గిగ్ కార్మికులు అమెజాన్, ఈ-కార్టు, డెలివరీ కం సర్వీస్ డెలివరీ బాయ్స్, స్విగ్గి, జోమాటో డెలివరీ బాయ్స్, ఓల, రాపిడో కార్మికులు, మీశో, బ్లూ డార్ట్, మిత్ర, అజియా, టాటా క్లిక్, ఇండియా మార్ట్, ఇ-బై డెలివరీ కార్మికులందరూ పేర్లను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అసంఘటిత కార్మికులందరూ ఈశ్రమ్ వెబ్‌సైట్/కామన్ సర్వీస్‌సెంటర్, గ్రామ, వార్డు సచివాలయాలు, సమీప కార్మిక శాఖ కార్యాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 17 వరకు పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోవాలంటే అసంఘటిత కార్మికుడై ఉండాలని, 16 నుంచి 59 సంవత్సరాల వయసు ఉండి, ఆదాయపు పన్ను చెల్లించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారులు కేశన్న, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు

కోర్టులో హాజరు



వన్యప్రాణి వేటగాళ్లతో ఫారెస్టు అధికారులు

రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు రేంజ్ పరిధిలోని లోతు వంక సమీపంలో వన్యప్రాణుల వేటగాళ్లను అరెస్టు చేసినట్లు సోమవారం రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. రుద్రవరం గ్రామానికి చెందిన కె. సాంబశివరావు, కె. చిన్నమల్లేశ్ అనే వేటగాళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి వన్యప్రాణి మాంసం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు వన్యప్రాణి వేటగాళ్లను హాజరుపరిచినట్లు తెలిపారు. వేటగాళ్లకు మేజిస్ట్రేట్ బెయిలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఆఫీసరు ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసరు రామక్రిష్ణ, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల ముఠా అరెస్ట్..?

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్ల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఒక లక్ష రూపాయల ఒరిజినల్ నోట్లు ఇస్తే రూ.3లక్షల నకిలీ నోట్లు ఇస్తామని మోసం చేసే ప్రకాశం జిల్లా గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లాలోని దర్శికి చెందిన ముగ్గురు, త్రిపురాంతకానికి చెందిన మరొకరు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మరో వ్యక్తి, నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన వ్యక్తి ఒక ముఠాగా ఏర్పడి కొంతకాలంగా నకిలీనోట్ల దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఒరిజినల్ నోట్లు తీసుకున్న అనంతరం నోట్ల కట్టల్లో పైన, కిందిభాగంలో నాలుగు, అయిదు ఒరిజినల్ నోట్లు పెట్టి మధ్యలో తెల్లకాగితాలను పెట్టి మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వీరు ఇచ్చిన ఆఫర్‌కు నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన ఒక వ్యక్తి ఆశపడి వారి వలలో పడినట్లు తెలిసింది. ఒరిజినల్ నోట్లు ఇచ్చి నకిలీ నోట్లు తీసుకొని పోవాలని అయ్యలూరు మెట్టవద్దకు రమ్మని సదరు నకిలీ నోట్ల ముఠా చెప్పడంతో అనుమానం వచ్చి నంద్యాల ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారినుంచి రూ.2లక్షల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంతజరుగుతున్నా పోలీస్ ఉన్నతాధికారులు, నంద్యాల తాలుకా సిబ్బంది మీడియాకు చెప్పకపోవడం గమనార్హం.

# నిధులు లేవు.. నీళ్లు రావు!

(5వ పేజీ తరువాయి)



దేవనకొండ మండలం కరిడికొండ వద్ద అసంపూర్తిగా పిల్ల కాలువలు

### సీఎం హామీ అమలు ఏదీ..?

పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో గత ఏడది అక్టోబరు 1న సీఎం చంద్రబాబు పర్యటించారు. కూటమి ప్రభుత్వం కొలుదీరాక తొలిసారిగా జిల్లాకు వచ్చారు. హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి సాగునీరు ఇస్తారని ప్రజావేదికలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇరిగేషన్ ఇంజనీర్లు రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆరు నెలలైనా సీఎం హామీ అమలు దిశగా అడుగులు పడడం లేదు. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

### కరువు తీరాలి.. వలసలు ఆగాలి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారణ లక్ష్యంగా 40 వేల ఎకరాలకు సాగునీరు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లతో శ్రీకారం చుట్టారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులకు మొదలు పెట్టారు. కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కేసీ కాలువకు 31.90 టీఎంసీలు నీటివాటా ఉన్నా.. నిల్వ చేసుకునే జలాశయం లేదు. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూ.2,980 కోట్లు మంజూరు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నా.. ఆ దిశగా కదలిక లేదు. పది నెలలు గడిచినా పనులు మొదలు కాకపోవడంతో కరువు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తాగునీరు.. రోడ్లపై దృష్టి సారించాలి

జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించేందుకు నేడు కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధ్యక్షతన జరుగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నారు. జిల్లానే వేధిస్తున్న తాగునీరు, రోడ్ల సమస్యలపై చర్చించాలని పలువురు కోరుతున్నారు. వాటర్‌గ్రిడ్ కింద రూ.5,500 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించాలి. అలాగే.. పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం, ఏపీ టిడ్కో ఇళ్ల పంపిణీపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది



### నేడు మంత్రి నిమ్మల పర్యటన ఇలా..

సోమవారం విజయవాడ నుంచి రైలులో బయలుదేరిన మంత్రి నిమ్మల మంగళవారం ఉదయం 5.20 గంటలకు గుంతకల్లు రైల్వే గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి 8 గంటలకు బయలుదేరి పత్తికొండ సమీపంలోని హంద్రీ నీవా కాలువ వద్దకు 8.45 గంటలకు చేరుకుంటారు. విస్తరణ పనులు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలు నగరం ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలతో సమావేశం అవుతారు. సాయంత్రం 3 గంటలకు డీడీఆర్ సమావేశానికి హాజరు అవుతారు. రాత్రి 8.30 గంటలకు డోన్‌కు చేరుకొని రైలులో విజయవాడకు బయలుదేరుతారు.

# బొమ్మిరెడ్డిపల్లిలో ఉద్రిక్తత

● గ్రామానికి చేరుకున్న హత్య కేసు నిందితులు

● హైకోర్టు ఆదేశాలతో బందోబస్తు



పోలీసు బందోబస్తుతో నిందితుల వాహనాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన హత్య కేసు నిందితులు పోలీసు బందోబస్తు మధ్య సోమవారం ఇళ్లకు చేరుకున్నారు. గత ఏడాది జూన్‌లో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గిరినాథ్ చౌదరి హత్యకు గురయ్యారు. ఈ కేసులో 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో వీరితో పాటు మరో 16 కుటుంబాల వారు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

అయితే హత్య కేసు నిందితులు తమకు పొలాలు ఉన్నాయని పంటలు సాగుచేసుకునేందుకు, పుట్టిన ఊరిలో బతికేందుకు రక్షణ కల్పించాలని 32 మంది గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని, రక్షణ కల్పించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. పత్తికొండ డిఎస్పీ వెంకట రామయ్య, కర్నూలు డిఎస్పీ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో 50 మంది ప్రత్యేక బలగాల సమక్షంలో నిందితులను గ్రామానికి తీసుకెళ్లారు. అయితే టీడీపీ నాయకుల ఇంటి సమీపంలో ఇళ్లు ఉండేవారితో ఘర్షణలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని, ఐదు కుటుంబాలను వెనక్కు పంపారు. గ్రామంలో సుమారు 15 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెల్దుర్తి సీఐ మధుసూదనరావు, కర్నూ లు సీఐ రామానాయుడు, పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, వెల్దుర్తి ఎస్ఐ అశోక్, క్రిష్ణగిరి ఎస్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

కారు ధ్వంసం: కాగా హత్య నిందితులు గ్రామంలోకి రావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ నాయకుడు చక్రపాణిరెడ్డి ఇంటి వద్ద కారును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసుల పికెట్ ఉన్నా ఇలా జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



నిందితులతో మాట్లాడుతున్న పోలీసులు

## అప్పుల బాధతో ఆత్మహత్య

దేవనకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక బేతపల్లికి చెందిన రాజు(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన సుంకన్న, లక్ష్మీదేవి దంపతుల పెద్ద కుమా రుడు రాజు తనకున్న రెండెకరాల పొలంలో గత రెండేళ్లుగా బోర్లు వేసి, మిరప, వేరుశెనగ పంటలు సాగు చేశాడు. పంటలు పండకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయింది. కుటుంబంతో కలసి గుంటూరుకు వలస వెళ్లాడు. గత మూడు రోజుల కిందట గ్రామానికి పని నిమిత్తం వచ్చి, ఆదివారం పురుగుల మందు తాగాడు. కర్నూలు ఆస్పత్రిలో కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు..!

● గోవిందపల్లె ఘటనలో విచారణను వేగవంతం చేసిన పోలీసులు

● మరో నిందితుడి కోసం గాలింపు ముమ్మరం




హత్యాయత్నం జరిగిన సీతారామాంజనేయ దేవస్థానం

శిరివెళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల మండలం గోవింద పల్లె గ్రామానికి చెందిన వైసీపీ మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై సీతారామాంజనేయ దేవస్థానంలో ఇటీవల జరిగిన హత్యాయత్నం ఘటనలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ప్రత్యక్ష సాక్షి వెంకట కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న గ్రామానికి చెందిన గంగ దాసరి రవిచంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రవిచంద్రారెడ్డి వెంట వచ్చి హత్యాయత్నానికి సహకరించినట్లుగా భావిస్తున్న మరో నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నిందితుడి ఆచూకీ కోసం ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## ప్రజా పరిష్కార వేదికలో అధికారుల మధ్య వాగ్వాదం

బండిఆత్మకూరు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే పరిష్కార వేదికలో ఇరువురు అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సోమవారం ఉదయం బండి ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొన్నారు. ఈ సమయంలో గత నెలలో మండలంలోని పరమటూరు గ్రామంలో సురేష్ అనే వ్యక్తికి చెందిన కంది పంట గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ కేసుపై వ్యవసాయ శాఖ రిపోర్టు ఇవ్వాలని ఎస్ఐ జగన్మోహన్ పోలీస్‌ను పంపగా సంతకం చేకుండా, పేపర్ చింపి తిప్పి పంపిందని, పరిష్కార వేదికలో ఉన్న ఏవో స్వాతి వద్దకు ఎస్ఐ వచ్చి రిపోర్టు ఇవ్వాలని వాదించారు. ఈ క్రమంలో తనను నువ్వు అనే ఏక వచనంతో ఎలా మాట్లాడతారని, మహి ళలను ఉద్దేశించి అట్లా ఎలా మాట్లాడతారని వాదించారు. తనకు గత నెల 13వ తేది వేసి రిపోర్టు ఇవ్వమని ఇప్పుడు లెటర్ పెట్ట డం ఏంటని ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని ఇ స్తే ఇవ్వండి, లేకపోతే మీ ఇష్టం అని ఎస్ఐ తిరిగి వెళ్ళిపోయారు. ఆ తరువాత సహచర అధికారుల ఎదుట ఏవో కన్నీరు పెట్టడం గమనార్హం.

## మాజీ ఎమ్మెల్యే కాటసాని హౌస్ అరెస్టు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని సోమవారం సాయంత్రం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరిగే రథోత్సవానికి కాటసాని హాజరుకావాల్సి ఉంది. అయితే అదే కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత కూడా హాజరయ్యారు. గ్రామంలో కొంత మంది వైసీపీ నాయకులు ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో కాటసాని అక్కడికి వెళ్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు కాటసానిని హౌస్ అరెస్టు చేశారు. నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడు, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐలు ఆధ్వర్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్ద మోహరించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

ప్రయాణికులు క్షేమం

మిడుతూరు, ఏప్రిల్ 7 ( ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామ సమీపం సమ్మర్ స్టోరేజ్ దగ్గర షార్ట్ సర్క్యూట్ వల్ల కారు పూర్తిగా దగ్ధం అయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా బయట పడ్డారు. మండలంలోని బైరాపురం గ్రామానికి చెందిన మహబూబ్ బాషా, అమినుల్ల బాషా, మహిమున్‌బీ అను ముగ్గురు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో బైరాపురం నుంచి నందికొట్కూరుకు వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి 8 గంటల సమయంలో తిరిగి సొంత గ్రామానికి కారులో వెళుతుండగా సమ్మర్ స్టోరేజ్ దగ్గర కారులో పొగలు రావడం గమనించిన డ్రైవర్ అమినుల్లా బాషా అప్రమత్తమై కారును పక్కకు ఆపాడు. అందులో వున్న ముగ్గురు వ్యక్తులు కిందకు దిగా రు. కొంత సమయానికి కారులో నుంచి మంటలు చెలరేగి కారు పూర్తిగా దహనమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

పగిడ్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన పఠాన్ దావుత్‌ఖాన్ (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కేసీ కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన దావుత్‌ఖాన్ ఆదివారం పని చేసేందుకు వెళ్లారు. పని ముగించుకొని కేసీ కాలువలో బట్టలు శుభ్రం చేసుకునేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు కేసీ కాలువలో పడి మృతి చెందాడు. మృతుడు తల్లి కొద్దిరోజుల కిందట మృతి చెందడం, భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒక్కడే ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు పఠాన్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

ఆదోని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాంతి నగర్‌కు చెందిన యువతి తల్లి మందలించడంతో సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని క్రాంతినగర్ చెందిన ఉరుకుందప్ప కుమార్తె ఇందు(20) సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తుండేది. ఇది గమనించిన తల్లి గట్టిగా మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ఇందు గదిలోకి వెళ్లి నిప్పంటించుకుంది. మంటలు, పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు.



# కౌతాళం అడవుల్లో కర్ణాటక వేటగాళ్లు

● తూటాల దెబ్బకు నేలకొరిగిన కృష్ణ జింకలు

● పోలీసుల అదుపులో వేటగాడు

● నాటు తుపాకీ, జింక మాంసం స్వాధీనం



ల్యాబ్‌కు పంపడానికి బాక్సుల్లో సిద్ధం చేసిన జింక మాంసం

ఆదోని రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కౌతాళం అడవుల్లో కర్ణాటక వన్య ప్రాణుల వేటగాళ్లు హల్‌చల్ చేశారు. పట్టపగలు కౌతాళం పంట పొలాల్లో జింకల మందపై వేటగాళ్లు తుపాకులతో దాడి చేసి కృష్ణ జింకలను చంపేశారు. రైతులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మెరుపుదాడి చేసి కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లారి హాళేవూరుకు చెందిన వన్యప్రాణుల వేటగాడు తిమ్మన్నను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఓ నాటు తుపాకీని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు వేటగాళ్లు తప్పించుకున్నారు. ఆదివారం ముగ్గురు వేటగాళ్లు ద్విచక్ర వాహనంపై కౌతాళం మండలం కాత్రికి సమీప పంట పొలాల్లో మాటు వేశారు. అదును చూసి గుంపుగా వెళ్తున్న జింకల మందపై ఒక్కసారిగా నాటు తుపాకీతో గురిపెట్టి కాల్చారు. ఈ కాల్పుల్లో పది జింకలు నేలకొరిగాయి. తుపాకీ మోతలు విన్న రైతులు భయపడి వెళ్ళి చూడగా, అక్కడ ముగ్గురు వ్యక్తులు జింకలను కోయడం చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. అంతలోపు వేటగాళ్లు జింక మాంసాన్ని సంచిలో వేసుకొని నాటు తుపాకీని పైకెత్తి కేకలు వేస్తూ వెళ్లిపోతుండగా, వీరికి పోలీసులు తారసపడ్డారు. ఇద్దరు వేటగాళ్లు పారిపోగా, తిమ్మన్న మాత్రమే నాటు తుపాకీ, జింక మాంసంతో పట్టుబడ్డాడు. ఆ తుపాకీ బ్రిటీష్ కాలంలోనిదని పోలీసులు అంటున్నారు. నిందితుడు తిమ్మన్నను పోలీసులు స్టేషన్‌కు తరలించి నాటు తుపాకీని భద్రపరిచి కుప్పగల్లు ఫారెస్టు ప్లాట్ వాచ్‌మెన్‌కు ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో సమాచారం అందజేశారు. ఆదోని ఫారెస్టు అధికారి తేజస్విని తన సిబ్బందితో కలిసి రాత్రి 8.30 గంటల సమయంలో కౌతాళం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వేటగాడు తిమ్మన్నను, నాటు తుపాకీని, జింక మాంసాన్ని, ద్విచక్ర వాహనాన్ని ఆదోనికి తరలించారు. కాగా వేటగాడిపై కేసు పెట్టొద్దని... ఫార్మాలిటీస్ ఉంటే చూసుకుంటామని ఫారెస్టు అధికారులపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి అనుచరుడు ఒత్తిడి తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

### నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నాం

కౌతాళం మండలం కాత్రికి పంట పొలాల్లో జింకలపై తుపాకీతో కాల్పులు జరిపి వాటి మరణానికి కారణమైన కర్ణాటకకు చెందిన తిమ్మన్నను అదుపులో తీసుకున్నాం. అతని నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నాం. నిందితుడ్ని కోర్టుకు హాజరు పరుస్తాం. జింక మాంసాన్ని ల్యాబ్‌కు పంపిస్తున్నాం.

- తేజశ్వని, ఆదోని ఫారెస్టు అధికారి

## కొనుగోలు కేంద్రం ప్రారంభం


మల్యాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగ పరుచుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మండలంలోని మల్యాల గ్రామంలో మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో శనగలు, మినుములు, కందులు కనీస మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. రైతులకు 50 శాతం రాయితీ కింద వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా హోండా స్ప్రేయర్లను అందజేశారు. కంది మద్దతు ధర క్వింటం రూ.7550, మినుములు రూ. 7400, శనగలు రూ.5650 ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, వ్యవసాయ శాఖా ఏడీ విజయశేఖర్, ఏఓ షేక్షావలి, మార్క్‌ఫెడ్ అసిస్టెంట్ మేనేజర్ అనూషా, గ్రామ సర్పంచ్ ఉమాదేవి, రైతుసేవా కేంద్రం సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేస్తున్న హరిసర్వోత్తమరావు

పాములపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు మండల టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్లగడ్డ హరిసర్వోత్తమరావు సోమవారం అందజేశారు. పాములపాడులో 1050 సభ్యత్వ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, శేషయ్య, వెంకటేశ్వరరావు, ఉస్మాన్, మల్లికార్జున, మద్దిలేటి, లింగస్వామి, రాజు, జలాల్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 6గంటలకు ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ సిబ్బందితో రహదారి భద్రత కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతానిబంధనలు, ట్రాఫిక్ నియమాలు ప్రజలు, వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. అలాగే రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్కూల్‌వ్యాన్, బస్సు డ్రైవర్లతో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## 11న నంద్యాల బార్ అసోసియేషన్ ఎన్నికలు


ప్రెసిడెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న హుసేన్‌బాషా

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బార్ అసోసియేషన్ ఎన్నికలు 11న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు రామకృష్ణయ్య, సుధాంశుమౌలిరెడ్డి, జి.శ్రీనివాసులు తెలిపారు. నంద్యాల న్యాయవాదుల బార్ అసోసియేషన్‌లో సోమవారం నామినేషన్ల ప్రక్రియ జరిగింది. అధ్యక్ష స్థానానికి సీనియర్ న్యాయవాది హుసేన్‌బాషా, జగన్మోహన్‌రెడ్డి, జనరల్ సెక్రటరిగా అన్నమయ్యగారి బాలసుబ్బయ్య, కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కానాల సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీగా శేషసాయిబాబా, బాలునాయక్, కోశాధికారిగా మద్దిలేటిరెడ్డి, లైబ్రరీ సెక్రటరిగా యాగంటిపల్లె మద్దిలేటి యాదవ్, స్పోర్ట్స్ సెక్రటరీగా గోస్పాడు ప్రసాదరెడ్డి, డి.చిన్నలింగమయ్య, లేడీ రెప్రెజెంటెడ్‌గా సౌజన్య నామినేషన్లు దాఖలు చేశారు.

## మహిళ అదృశ్యం

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన కత్తి కవిత అనే మహిళ అదృశ్యమైనట్లు తాలుకా పోలీసులు సోమవారం తెలిపారు. కవిత ఈ నెల 3వ తేదీ మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలోని మిరప పంట కోసేందుకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో భర్త వెంకటేశ్వర్లు ఆందోళనకు గురయ్యాడు. తోటి కూలీలను, బంధువులు, గ్రామంలోని సన్నిహితులతో ఆమె ఆచూకీ కోసం గాలించాడు. ఆమె కనపడకపోవడంతో భర్త వెంకటేశ్వర్లు నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్ఐగా శ్రీనివాసులు

నందికొట్కూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణ ఎక్సైజ్‌శాఖ ఎస్ఐగా భాష్యం శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా పత్తికొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నందికొట్కూరుకు నియమితులయ్యారు.

## సోలార్‌ను ఏర్పాటు చేసుకోండి

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ ద్వారా సోలార్‌ను ఏర్పాటుచేసుకుంటే విద్యుత్ బిల్లును 90శాతం తగ్గించుకోవచ్చునని కీర్తి సోలార్ పవర్ ఏజన్సీ ఎండీ జనార్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం నేడు అన్ని వర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉందన్నారు. కీర్తి సోలార్ పవర్ ఏజన్సీస్ ఏపియస్‌పిడిసియల్‌తో కలిసి సోలార్ రూఫ్‌టాప్ అవగాహన డ్రైవ్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.



జిల్లాలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన పందెం పోటీలు సోమవారం ముగిశాయి. బండలాగుడు, పొట్టేళ్లు, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. పోటీల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# పండుగ పోటీలు

## బండలాగుడు పోటీలు


బండను లాగుతున్న ఎద్దులు

మిడుతూరు, ఏప్రిల్ 7( ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసుల గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా అంత రాష్ట్ర స్థాయి ఆరు పళ్ల ఎద్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. నంద్యాల జిల్లా సుంకేసుల గ్రామానికి చెందిన సుధీర్ కుమార్ రెడ్డి ఎద్లు మొదటి స్థానంలో, రాయవరం గ్రామానికి చెందిన అక్షరా రెడ్డి ఎద్లు రెండవ స్థానంలో నిలిచాయి. కంచుపాడు గ్రామానికి చెందిన అంజినేయ రెడ్డి ఎద్లు మూడో స్థానంలో, నాలుగో స్థానంలో మిడుతూరు గ్రామానికి చెందిన సాయి నిక్షిత్ ఎద్లు, రాయవరం గ్రామానికి చెంది అక్షరా రెడ్డి ఎద్లు ఐదవ వస్థానం, కొనిదెల గ్రామానికి చెందిన నరసిహుడు ఎద్లకు ఆరో స్థానంలో, మద్దెం గ్రామానికి చెందిన మహబూబ్ బాష ఎద్లు ఏడో స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో గెలు పొందిన యడ్ల యజమానులకు ఏడు నగదు బహుమతులు రూ. 60 వేలు, రూ.50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ 8 వేలు కమిటీ నిర్వాహకులు అందజేశారు.

## హోరాహోరీగా పొట్టేళ్ల పందెం


పగిడ్యాలలో తలపడుతున్న పొట్టేళ్లు

పగిడ్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల గ్రామంలో నిర్వహిస్తున్న చెన్నకేశ్వవ స్వామి తిరుణాల సందర్భంగా రైతు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పొట్టేళ్ల పందెం పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 12 పోటేళ్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. చెరుకుచెర్ల గ్రామానికి చెందిన ఒబన్న పొట్టేళ్లు మొదటి స్థానంలో, దామగట్లకు చెందిన మాలనాబీకి చెందిన పోట్టేళ్లు రెండో స్థానంలో, పగిడ్యాలకు చెందిన శివరాముడు పోట్టేళ్లు మూడో స్థానంలో గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన పోట్టేళ్ల యజమానులకు రైతుసంఘం సభ్యులు రూ. 8వేలు, రూ.6వేలు, రూ.4వేలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముచ్చుమర్రి పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

## పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే


తూడిచర్లలో బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచర్ల గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని సోమవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. ఈపోటీల్లో కర్నూలు జిల్లా కైరవాడి గ్రామం లక్ష్మన్నకు చెందిన వృషభాలు విజయ భేరీ మోగించి ప్రథమస్థానంలో నిలిచి రూ. 50వేలు కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం పచ్చర్ల గ్రామానికి చెందిన సతీష్‌కుమార్‌రెడ్డికి చెందిన వృషభాలు ద్వితీయస్థానంలో నిలిచి రూ. 40వేలు కైవసం చేసుకున్నాయి. మూడో బహుమతి కర్నూలు జిల్లా రేమటకు చెందిన చిన్నగిడ్డయ్య వృషభాలు రూ.30వేలు, నాల్గో బహుమతి నంద్యాల జిల్లా ఎన్.కొత్తపల్లె గ్రామానికి చెందిన వెంకటరెడ్డి వృషభాలు రూ. 20వేలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బాలమద్దిలేటి, టీడీపీ నాయకులు మాండ్రసురేంద్రనాథరెడ్డి, రాముడు, సత్యనారాయణశెట్టి, పద్మనాభయ్య, నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, దేవసహాయం, అధికసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

## వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం

పగిడ్యాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాలలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవ వేడుకలను భక్తులు సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం సందర్భంగా ఆలయ పురోహితులు వీరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందల మంది ప్రజలు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

## వైభవంగా రథోత్సవం



కొత్తపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. పురోహితులు రాము, హరిక్రిష్ణ ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సోమవారం నంద్యాల రైల్వేస్టేషన్ రహదారిలో గల రామాలయంలో నృత్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల చిన్నారి సరయు రెడ్డి సాంస్కృతి కార్యక్రమాలలోని నృత్య ప్రదర్శనలో పాల్గొంది. ఈ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

## నేడు కరివేనలో బండలాగుడు పోటీలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కరివేన గ్రామంలో రామాలయ కరివేన గ్రామ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కరివేన యువగళం సభ్యులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ 30,000, రెండవ బహుమతిగారూ20,000, మూడవ బహుమతిగా రూ15,000లు, నాలుగవ బహుమతిగా రూ10,000, ఐదవ బహుమతిగా రూ 5,000లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైనరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతుధర లేక పెట్టినపెట్టుబడి ఖర్చులు చేతికిరాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మజీద్, రంగనాయకులు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

## చెంచుల సమస్యలు పరిష్కరించండి

సున్నిపెంట,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చెంచుల సమస్యలు పరిష్కరించాలని కొమరం భీమ్ ఆదివాసీ చెంచు గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజక వర్గం పరిధిలోని రుద్రవరం మండలం అంకాలమ్మ చెంచు గూడెంలో సుమారు 35 కుటుంబాలు జీవిస్తున్నాయని, వారికి జీవనోపాధిలేక బెంగులూరు, మద్రాసు పట్టణాలకు వలస పోతున్నారని, వారి ఒక్కో కుటుబానికి 5 ఎకరాల సాగు భూమి ఇవ్వాలని కోరారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం డీఎంఅండ్‌హెచ్ డా.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించి నివారించదగ్గ మరణాలను అంతం చేయాలన్నారు. మహిళ దీర్ఘకాలిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తల్లి, పిల్లల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఆయుష్మాన్ భారత్, జాతీయ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు.

## మహిళల సంరక్షణకు శక్తి యాప్: ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహిళల సంరక్షణకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా శక్తిటీం బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పోస్టర్లను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీలు చంద్రబాబు, ఆల్ఫోన్స్, సిబ్బంది విడుదల చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 131 ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 12952మంది సెల్ ఫోన్లలో శక్తియాప్‌ను నిక్షిప్తం చేసినట్లు చెప్పారు.

## పాస్టర్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి


నందికొట్కూరులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

నందికొట్కూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ఆల్ డినామినేషన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రఘురాంమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏసేపు, పుల్లయ్య, డేవిడ్, అహరున్, శర్వానంద పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర న్యాయ విచారణ చేయించాలని పాస్టర్లు ఏంజల్ గోవిందరెడ్డి, జోషఫ్ మల్లికార్జున, కిరణ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట క్రైస్తవ సంఘ పెద్దలు, సీపీఎం, కేవీపీఎస్, వ్యకాసల ఆధ్వర్యంలో ధర్నా చేశారు అనంతరం తహసీల్దార్ పద్మావతమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రత్నమయ్య, డేవిడ్, రాజు, ఏసేపు, శివ, నాగేశ్వరరావు, పుల్లయ్య అనిల్‌కుమార్‌చ రమణ పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి


జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, అప్పటి వరకు ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వారు కళ్లకు నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం సరికాదని అన్నారు. రాష్ట్రంలోని కూటమి భాగస్వామ్య పక్షాలు లౌకికవాద ముసుగులో ఉండి చివరకు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. పేద ముస్లింల కోసమే ఈ బిల్లును తెచ్చినట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెబుతున్నప్పటికీ అందులో ఏముందో కూడా వారికి తెలియదని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రతాప్, ఇస్మాయిల్, వెంకటశివుడు, ముర్తుజాబీ, చాంద్‌బాషా ఉన్నారు.

జూపాడుబంగ్లా: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రఘురామమూర్తి, కాంగ్రెస్‌నాయకులు ఉస్మాన్‌బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు హమీద్ అన్నారు. సోమవారం జూపాడుబంగ్లా ఆర్టీసీ బస్టాండు నుంచి కేజీ రోడ్డు వెంట ముస్లీం భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, సలీం, రఫీ పాల్గొన్నారు.

## ముస్లింలను ముంచిన చంద్రబాబు : వైసీపీ

నందికొట్కూరు: ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు బిల్లుకు టీడీపీ అనుకూలంగా ఓటు వేసి ముస్లింలను మోసం చేసిందని వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకులు దౌలత్‌బాషా అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ మసీదుల్లో నమాజు చదివించే మౌజన్, ఇమాంమ్లకు జీతాలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. నిరుపేద పిల్లలు రోడ్డు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

## రాయితీని సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులను ఈ నెల 30వ తేదిలోగా చెల్లించి 5శాతం రాయితీని సద్వినియోగించుకోవాలని కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని నివాస, నివాసేతర, భవనాలకు సంబంధించిన ఇంటి పన్నులు, కూళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులతో పాటు ఇతర వాణిజ్య, ఆక్రమణల పనులను ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించినట్లయితే మొత్తం పన్ను చెల్లింపులో 5శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

## పాత సంగమేశ్వరం ఆలయానికి విద్యుత్ పునరుద్ధరణ

కొత్తపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత ఎనిమిది నెలలుగా కృష్ణానది జలాల్లో నిక్షిప్తమై ఇటీవల బయల్పడిన పాత సంగమేశ్వరస్వామి ఆలయానికి కొత్తపల్లి మండల విద్యుత్ అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఎగువ ఉమామహేశ్వరాలయం నుంచి నది జలాల్లో బయల్పడిన సంగమేశ్వర ఆలయ పరిసరాలు, గర్భాలయం, ఆలయ మండపంలో అధికారులు విద్యుత్ సరఫరాను అందించడంతో, విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయడంతో ఆలయం విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడుతుంది.

## వేధింపుల కేసు నమోదు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని శివ గార్డెన్స్‌లో నివాసం ఉంటున్న మౌనికను అత్తింటివారు వేధిస్తుండటంతో వేధింపుల కేసు నమోదు చేసినట్లు తాలుకా పోలీసులు సోమవారం తెలిపారు. భర్త సోమశేఖర్‌రెడ్డి అదనపు కట్నం కావాలని నిరంతరం వేధిస్తుండేవాడు. మహిళ భర్తతోపాటు అత్త, ఇంట్లో ఉన్న వారు తీవ్రంగా వేధిస్తుండటంతో విసిగిపోయిన మౌనిక తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భూపనపాడుకు టీబీ ముక్త్ పంచాయతీ అవార్డు


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న భూపనపాడు సర్పంచ్, కార్యదర్శి

పాణ్యం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూపనపాడు గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ పంచాయతీ అవార్డుకు ఎంపికైనట్లు సర్పంచ్ జనార్ధన్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవార్డు పంపిణీ కార్యక్రమంలో కలెక్టరు రాజకుమారి చేతుల మీదుగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు అవార్డు అందుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో నాలుగు టీబీ కేసులు ఉండగా టీబీ నిర్మూలన అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి టీబీ రోగులను పర్యవేక్షిస్తూ టీబీ రోగులను ఆరోగ్యవంతంగా చేయడంలో కృషి చేశారన్నారు. ఇందుకు తోడ్పాటునందించినందుకు గ్రామ పంచాయతీకి అవార్డు ప్రకటించిందన్నారు. జిల్లా టీబీ నివారణా అధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మిడుతూరు: మిడుతూరు మండల పరిధిలోని 49 బన్నూరు గ్రామంలో టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దినందుకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి బీజాన్‌బి, గ్రామ సర్పంచ్ భూదేవిని కలెక్టర్ రాజకుమారి వారిని అభినందించి అవార్డు అందజేసినట్లు ఎంపీడీవో దశరథరామయ్య తెలిపారు. వైద్య అధికారులు ఇటీవల మండలంలోని గ్రామాలలో టీబీ సర్వే నిర్వహించడం జరిగింది. 49 బన్నూరు గ్రామంను టీబీ ముక్త పంచాయతీగా ఎంపిక చేశారని ఎంపీడివో తెలిపారు.

## వెండి రథంపై ఆది దంపతుల విహారం


రథాన్ని లాగుతున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై అశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు

- శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్‌కు చెందిన యం. విజయ గురుదత్త బృందంచే భరతనాట్యం ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, వినాయక కౌత్వం, శివాష్టకం, శివపంచాక్షరీస్తోత్రం, దేవీస్తుతి తదితర గీతాలకు విజయ, అవంతిక, దేవిక, భవ్యశ్రీ, లక్ష్మిప్రియ, రక్షిత తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.

## పల్లకిలో ఊరేగిన మహానందీశ్వరుడు

మహానంది,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆలయ వేదపండితులు ఘనంగా పల్లకిసేవ ఉత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజలు జరిపారు.

## గోపవరంలో బెల్టు షాపులపై దాడులు

మహానంది, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరం గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాపు పెట్టుకొని మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు నంద్యాల ఎక్సైజ్ ఎస్ఐ బ్రహ్మయ్య తెలిపారు. నంద్యాల ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో సిబ్బంది సహాయంతో దాడులు నిర్వహించి బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మద్దిలేటి, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గతంలో కూడా గోపవరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమణ, ఫరూఖ్, విజయుడు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- యాగంటి-బనగానపల్లె రెండు వరుసల రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**బనగానపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిన్న రాజుపాలెంలో రూ.12.50 కోట్ల వ్యయంతో యాగంటి-బనగానపల్లె వరకు రెండువరుసల రోడ్డు నిర్మాణానికి మంత్రి బీసీ, టీడీపీ నాయకుడు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 7.5 కిలో మీటర్ల రహదారిని రెండు వరుసలుగా చేయనున్నట్లు తెలిపారు. ప్రమాదకర మలుపులు ఉన్న మద్దిలేటయ్య తాళ్ల వద్ద రూ.4.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ దేశంలో వృద్ధి రేటులో రెండో స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. త్వరలో రూ.3వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ శాఖ నిర్వీర్యమైందన్నారు. సింగిల్‌లైన్ రోడ్డుగా ఉన్న ప్యాపిలి, యాగంటి, బనగానపల్లె రోడ్లను నాలుగువరుసల రహదారులుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు వంగల పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణానాయక్, నరసింహులు, భూషన్న, రామాంజనేయులు, బాబయ్య, మంగంపేట శ్రీనివాసులు, పాతపాడు సర్పంచ్ నారాయణరెడ్డి, ఆర్‌సి నాగిరెడ్డి, బత్తుల భాస్కర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, శంఖేశ్వర రెడ్డి, నారాయణ రెడ్డి, తిరుమలయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సునీల్ రెడ్డి, ఏఈ హుసేన్, ప్రజలు పాల్గొన్నారు.


బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**స్థల పరిశీలన**

పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే పెట్రోల్‌బంకు కూడలిలో భారీగా వాహనాలు వస్తుండడంతో రోడ్డు వెడల్పు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌కుమార్, ఏఈ హుసేన్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు పాల్గొన్నారు.

**మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం**

బనగానపల్లె పట్టణ శివారులోని నంద్యాల రహదారిలోని దస్తగిరి స్వామి దర్గా వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయి కృష్ణ, బాష, షబ్బీర్, షేక్షా, మున్నా, దాదాబాష, చాంద్, మహి, సూరి, సికందర్‌బాషా, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

**చాగలమర్రి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏవో రంగనేతాజీ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల విక్రయ స్టాల్‌ను మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరెడ్డి, పెద్దవంగలి, శెట్టివీడు యూనిట్ ఇన్‌చార్జీలు కదిరి బాషా, నిరంజన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు అనురాధ, న్యామతుల్లా, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఐసీఆర్‌పీలు వీరభద్రుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

**రుద్రవరం:** ప్రకృతి వ్యవసాయం సాగు చేద్దామని వ్యవసాయాధికారి సుమతి అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు రుద్రవరంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

## సేవా అవార్డు అందజేత

**డోన్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన వారికి సేవా అవార్డులు అందజేశారు. కర్నూలులో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో నిర్వహించిన అభినందన సభలో డోన్ ఇండియన్ రెడ్‌క్రాస్ అధికార ప్రతినిధి కొచ్చెర్వు వెంకటేశ్వర్లుకు సోమవారం మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ అవార్డును అందజేశారు.

## యువత క్రీడల్లో రాణించాలి: బీసీ ఇందిరమ్మ

**బనగానపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** యువత క్రీడల్లో రాణించాలని ఇందుకు తమవంతు సహకారం ఉంటుందని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. సోమవారం యనకండ్ల గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలక బహుమతులు అందించారు.

## బావిలో వ్యర్థాలను తొలగించాలి

**సంజామల,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) :** సంజామలలో కమలమ్మ బావిలో వ్యర్థాలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం బావి శిథిలావస్థకు చేరుకోవడంతో సమీప కాలనీవాసులు వ్యర్థాలను బావిలో వేస్తున్నారు. బావిలో వ్యర్థాలను, పూడికను తొలగించి అందుబాటులోకి తీసుకరావాలని గ్రామ పంచాయతీ అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

## పాండురంగ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గుండయ్య



**కోవెలకుంట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ పాండురంగా విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గుద్దేటి గుండయ్య అలియాస్ చిన్న వెంకటసుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. త్వరలో గుండయ్యతో పాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తన ఎంపికకు సహకరించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, టీడీపీ నాయకులు గువ్వల సుబ్బారెడ్డి, మురళీ, పెనుగొండ రాజశేఖర్, కులాకి, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మేలో నిర్వహించనున్న పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

## రేపు నీటి సరఫరాకు అంతరాయం

**డోన్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో బుధవారం ఒక రోజు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ ప్రసాద్ గౌడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బండగుట్ట దగ్గర నీటి పైపులైన్ లీకేజీ వలన బుధవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పట్టణ ప్రజలు గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. 10వ తేదీ గురువారం నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

## 'ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి'

**డోన్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని బృంధావన కాలనీలో మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్‌తో కలిసి చైర్మన్ పర్య టించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు. త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్‌హుశేన్, వార్డు నాయకులు పూజారి వంశీ, ఆర్టు రమణ, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్ ఉన్నారు.

## రంగాపురంలో రాములోరి పల్లకి ఊరేగింపు

**బేతంచెర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన సీతారాముల తిరునాళ్లను పురస్కరించుకుని రామాలయం నుంచి సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు పల్లకిలో ఊరేగించారు. భవిత విద్యానికేతన్ విద్యార్థులు కోలాటం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భవిత విద్యానికేతన్ కరస్పాండెంట్ రామాంజనమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** మండల కేంద్రంలో ఐ మిత్ర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కంటి వైద్య సహాయ నిపుణులు పులిపాటి గోపాల్ సోమవారం వెల్లడించారు. కంటి వైద్య నిపుణులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తారన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**దొర్నిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. సోమవారం దొర్నిపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీటీసీ శకుంతలారెడ్డి, తహసీల్దార్ సుభద్ర, వ్యవసాయాధికారి ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, విద్యుత్ శాఖ ఏఈ అనంతరావు, వెలుగు ఏపీవో బాబు, వైద్యాధికారి రుహుల్లాఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, ఎంఈవో మనోహర్‌రెడ్డి, వార్డెన్ రాముడు పాల్గొన్నారు.

## ఈశ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకోండి

**డోన్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** ఈశ్రమ్‌లో కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని లేబర్ ఆఫీసర్ సంధ్య తెలిపారు. సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 17వరకు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈశ్రమ్‌లో నమోదు చేసుకోవడంతో ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద 5 లక్షల వరకు ఆరోగ్య కవరేజ్ ఉంటుందన్నారు.



## కడుపు నొప్పితో విద్యార్థి మృతి

**బనగానపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** కడుపు నొప్పితో విద్యార్థి మృతి చెందాడు. ఈఘటన పెద్దరాజుపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన రాకేశ్ కుమారుడు రుషేశ్వర గౌడ్(13) 7వతరగతి చదువుతు న్నాడు. మూడు రోజుల క్రితం రేషేశ్వర గౌడ్‌కు కడుపునొప్పి రావడంతో డాక్టర్లకు చూపించారు. మళ్లీ నొప్పి అధికం కావడంతో బనగానపల్లెకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కడుపునొప్పితోనే బాలుడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు

**బనగానపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని పసుపల గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. అంతకుముందు బీసీకి టీడీపీ యువనాయకులు షేక్షావలి, బాలనాయుడులు తదితరులు ఘన స్వాగతం పలికారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని గ్రామంలో రైతులు, గ్రామస్థులు కలసికట్టుగా రైతు సంబరాలు నిర్వహించుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. అలాగే ట్రాక్టర్ రివర్సు పందెం, గుండుపందెం, కబడ్డీ, కుర్చీల పందెం, మహిళల తాడాట వంటి పోటీలు ఏర్పాటు చేసి గ్రామస్థులందరినీ భాగస్వామ్యం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.


పసుపులలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

## శిరివెళ్ల సర్కిల్ సీఐపై బదిలీ వేటు

- గోవిందపల్లె ఘటనలో ఉన్నతాధికారుల చర్యలు

**శిరివెళ్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** శిరివెళ్ల సర్కిల్ సీఐ వంశీధర్‌పై బదిలీ వేటు పడింది. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో ఈ నెల 5న వైసీపీ నాయకుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై హత్యాయత్నం జరగడంతో జిల్లా వ్యాప్తంగా కలకలం రేగింది. గత ఎనిమిదేళ్లగా ఫాక్షన్ గ్రామంగా, అత్యంత సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన గోవిందపల్లెలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నప్పటికీ గ్రామం నడిబొడ్డున ఉన్న సీతారామాంజనేయ ఆలయంలో హత్యాయత్నం చోటు చేసుకోవడంతో పోలీసు ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే శిరివెళ్ల సీఐగా పని చేస్తున్న వంశీధర్ పై వేటు పడినట్లు తెలుస్తోంది. కర్నూలు రేంజ్ డీఐజీ ఉత్తర్వుల మేరకు శిరివెళ్ల సీఐగా పని చేస్తున్న వంశీధర్‌ను వీఆర్‌కు పంపగా అన్నమయ్య జిల్లాలో డీటీసీలో పనిచేస్తున్న దస్తగిరి బాబును శిరివెళ్ల సర్కిల్ సీఐగా ఉన్నతాధికారులు నియమించారు.

## ప్యాపిలి టెక్నికల్ అసిస్టెంట్ సస్పెండ్

**బనగానపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** ప్యాపిలి టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాంభూపాల్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఎం.వెంకటసుబ్బయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాంభూపాల్‌రెడ్డి ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.11.50 లక్షలు దుర్వినియోగం చేయడంతో సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు: సీఐ

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠినచర్యలు చేపడతామని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం మండలంలోని తిమ్మనాయినిపేటలో ఆయన పర్యటించారు. గ్రామస్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

## జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంబైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. పదవతరగతి హాల్ టికెట్ జిరాక్సు, రెండు ఫొటోలో, ఇతర ధృవపత్రాలు తీసుకొని కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## ఆదర్శంగా నిలుద్దాం

**డోన్ టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని రామదుర్గం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదామని ఎపిక్ సిస్టమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాదు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కలపల విజయకుమార్, హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాదు డైరెక్టర్ డాక్టర్ హిమజ అన్నారు. సోమవారం మండలంలోని బీ.రామదుర్గం గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగన్న, సీపీఐ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వీఆర్వో అప్పల పెద్దపుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కే.రామాంజనేయులు, గ్రంథాలయం స్థల దాతలు వడ్డారి సూర్యనారాయణరెడ్డి, వడ్డారి గిడ్డారెడ్డి, ఎపిక్స్ ఎపిక్స్ సిస్టమ్ ప్రతినిధి భరత్ కుమార్, అనీష్, ఆలంకొండ రామాంజనేయులు, మేఘవర్ణుడు, అప్పల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చంద్రపల్లిలో కబడ్డీ పోటీలు

**ప్యాపిలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని చంద్రపల్లి గ్రామంలో కోదండ రామస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. టీడీపీ సీనియర్ నాయకులు వై లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పోటీలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి 15జట్లు పాల్గొన్నాయి.

## ఘనంగా సీతారాముల కల్యాణం

**చాగలమర్రి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కొలుములపేట గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా సోమవారం సీతారాముల కల్యాణం వేదపండితుడు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయదారులచే కల్యాణ్యం చేయించారు. తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


కమలాపురంలో ఉత్సవమూర్తుల ఊరేగింపులో గ్రామ పెద్దలు


కొలుములపేటలో సీతారాముల కల్యాణం చేస్తున్న వేద పండితులు

**డోన్ రూరల్:** మండలంలోని కమలాపురం, కోట్లవారిపల్లె, చిన్న మల్యాపురం, సోంపురం గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

## తాగునీటికి ఇక్కట్లు

- బిందె నీటి కోసం ఎదురుచూపు
- చేతిబోరు నీరే శరణ్యం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో బిజినవేముల బీసీ కాలనీవాసులు

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు చెబుతున్నా స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని గ్రామాల్లో అవస్థ తప్పడం లేదు. మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని బీసీకాలనీ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మోటారు నుంచి పైపులైను సుమారు 700 మీటర్ల మేర ఏర్పాటు చేసి కాలనీకి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైపులైను దూరం కావడంతో తాగునీరు ఈ కాలనీకి సరిగా సరఫరా కావడంలేదు. ఒకవేళ వచ్చినా ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగుకాల్వలో పైపులైను ఉండడంతో పైపు పగిలిపోయి కలుషిత నీరు సరఫరా అవుతుం ది. దీంతో కాలనీవాసులు ఈ కలుషిత నీటిని తాగలేక కాలనీలో ఉన్న చేతిబోరు నీటినే ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల కాలనీలో ఒక బోరు వేశారు. నీరు సమృద్ధిగా రావడంతో మోటారు అమర్చి కాలనీకి పైపులైన్ వేసి నీటిని సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. కానీ నేటికీ పైపులైను అమర్చలేదు. దీంతో కాలనీవాసులకు నీటి కష్టాలు తప్పలేదు. ఇటీవల మంత్రి కాలనీలకి రూ. 35లక్షలు వెచ్చించి చక్కటి సీసీ రోడ్లు వేయించారు. అయితే, నీటి సమస్య మాత్రం అలాగే ఉందని కాలనీవాసులు అంటున్నారు. మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని నీటి సమస్య పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.


కాలనీలో బోరు వద్ద నీళ్ల కోసం వేచి ఉన్న ప్రజలు


తాగునీటిని బైకుపై తెచ్చుకుంటున్న దృశ్యం

**తాగునీటి కోసం ఇబ్బందులు**



కాలనీకి తాగునీరు సరఫరా కావడంలేదు. ఎప్పుడు వస్తాయో తెలియదు. విషయం అధికారులకు తెలిపినా పట్టించు కోవడంలేదు. జిల్లా అధి కారులు స్పందించి తాగునీరు సమస్య పరిష్కరించాలి

- అవుకు ఓబుల్‌రెడ్డి, స్థానికుడు

**అధికారుల నిర్లక్ష్యమే**



తాగునీటికి కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు నాయకులు నిర్లక్ష్యం వీడి తాగునీటిని అందించాలి.

- ఆర్.నారాయణమ్మ, స్థానికురాలు

## నేటి నుంచి కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాలు

**అవుకు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 13వతేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణ, దీక్షాప్రారంభం, శ్రీవారు కొండపైకి వెళ్లుట, 9న హనుమవాహన సేవ, 10న గరుడవాహన సేవ, 11న గజవాహనం సేవ, పర్వ రాయబారం, శ్రీవారి తరుపున కొండపైకి చేరుట, సాయంత్రం 6గంటలకు స్వామి మాల భక్తుల దీక్షా విరమణ, 12న ఉదయం స్వామి వారి కల్యాణం, సాయంత్రం రథోత్సవం, 13 న ఉదయం పూర్ణాహుతి, వసంతోత్సవం, సాయంత్రం పారువేట, రాత్రికి ఉప్పలపాడు గ్రామంలో గ్రామోత్సవం కార్యక్రమాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

## ఆలమూరు నుంచి తిరుమలకు సైకిల్ యాత్ర


ఆలమూరు నుంచి తిరుమలకు బయల్దేరిన యువకులు

రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దేశం సుభిక్షంగా ఉండాలంటూ మండలంలోని ఆలమూరు గ్రామం నుంచి తొమ్మిది మంది యువకులు సోమవారం తిరుమలకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండి, పాడి పంటలతో వర్ధిలాలని ఆకాంక్షిస్తూ సైకిల్ యాత్ర చేపట్టామన్నారు. ఆలమూరు గ్రామం నుంచి తిరుమలకు సుమారు 250 కి.మీ దూరం ఉందన్నారు. మూడురోజుల్లో తిరుమలకు చేరుకుంటామని యువకులు తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన సీఐ యుగంధర్



**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ టౌన్ సీఐగా యు గంధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా ప్రొద్దుటూ రు నుంచి వచ్చిన సీఐ యుగంధర్‌కు ఎస్‌ఐలు షేక్ నగీన, జయ్యప్ప, పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల సంరక్షణకు తన వంతుగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.

## దొర్నిపాడు ఎస్‌ఐగా సత్యనారాయణ



**దొర్నిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** దొర్నిపాడు ఎస్‌ఐగా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ హనుమంత రెడ్డి బదిలీపై వెళ్లడంతో నంద్యాల నుంచి సత్యనారాయణ దొర్నిపాడుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంగా మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

## కలశ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

**రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** రుద్రవరం ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం కలశ ధ్వజప్రతిష్ఠ పూజలను అర్చకులు వారణాసి గోపిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య కలశాలను ఏర్పాటు చేసి గోపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు.

## దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

**రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణంలో చలివేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, ఏవో సుబ్రహ్మణ్యం, పీఆర్ ఏఈ కమాల్‌సాబ్, ఆనంద్ పాల్గొన్నారు.

**ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ..**

**ఆళ్లగడ్డ:** ఆళ్లగడ్డలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ సర్వేయర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేద్రాన్ని సోమ వారం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ రాముడు, విజయలక్ష్మి, జూనియర్ అసిసెంట్ స్వప్న, మండల సర్వేయర్ రవిప్రకాష్, వీఆర్‌వోలు హసన్, ఓబులేసు, గోవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పరీక్షలు నిర్వహించాలి

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** ఏపీలో పోలీసు నియామకాలకు పరీక్షలు నిర్వహించాలని నంద్యాల జిల్లా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 2022 నవంబరులో పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని, ఇప్పటి వరకు పరీక్షలు నిర్వహించలేదన్నారు. వెంటనే పరీక్షలు నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే గ్రూప్ 1, 2 పోస్టుల ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని డిమాండ్ చేశారు.

## డీఐజీని కలిసిన టీడీపీ నాయకుడు

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఆళ్లగడ్డకు చెందిన నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి బంగారు రాము యాదవ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందజేశారు.


## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**దొర్నిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె గ్రామంలో వైద్యాధికారి హుసేన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన ప్రారంభం.. ఆశా జనకమైన భవిష్యత్తు అనే ప్రణాళికతో ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భాగ్యమ్మ, వైద్య సిబ్బంది ఉన్నారు.

## హోరాహోరీగా రాతిదూలం పోటీలు

**చాగలమర్రి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) :** మండలంలోని కొలుములపేటలో శ్రీరామనవమిని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగం వృషభరాజముల బండలాగుడు పోటీలు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఏఎస్‌ఐ అబ్దుల్ నబి సోమవారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది జతల వృషభాలు పోటీలలో పాల్గొన్నాయి. విజేతలకు వరుసగా ఎనిమిది బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మురుగు కాల్వను శుభ్రం చేయించాలి


కాల్వలో పడిన వ్యర్థాలు

**రుద్రవరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ఆలమూరు గ్రామంలో ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న కాల్వలో చెత్తాచెదారంతో మురుగు నిలిచిపోయింది. దాంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు కాల్వలను శుభ్రం చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.